సీఎం జగన్ రాష్ట్రానికి దిక్సూచి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



కేపీదొడ్డిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ప్రభుత్వ విప్ కాపు, ఎంపీ తలారి రంగయ్య ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

గుమ్మఘట్ట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి దిక్సూచిగా మారారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. కేపీదొడ్డి గ్రామంలో సర్పంచ్ రమేష్, జిల్లా గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు గౌని కాంతారెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందుతో కలిసి ప్రభుత్వ విప్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడని, అయితే సీఎం వైఎస్ జగన్ ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం అమలు చేశారన్నారు. మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని తిరిగి చూడని నాయకులను నమ్మితే తీవ్రంగా నష్టపోవడం ఖాయమన్నారు. కరోనా విపత్కర సమయంలో కనిపించని టీడీపీ నాయకులు ప్రస్తుతం అప్పుడప్పుడు కనిపిస్తు డ్రామాలు ఆడుతూ తమ ఉనికిని కాపాడుకుంటున్నారని విమర్శించారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. సర్పంచులు అనిల్,రాజేష్, ఎంపీటీసీ గోవిందు, వైస్ సర్పంచ్ రమేష్, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, పీసీ చైర్మన్ రమేష్, గలగల సిద్దప్ప, మాజీ సర్పంచ్‌లు పాలయ్య, చిత్రోశేఖరప్ప పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రాయదుర్గం రూరల్: నియోజకవర్గంలోని వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు(సెర్ప్) బుధవారం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 23 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించిన సందర్భంగా దుర్గాదేవి మండల సమాఖ్య కార్యాలయంలో ఏరియా కో ఆర్డినేటర్ గంగాధర్ అధ్యక్షతన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను సీఎం జగన్ పరిష్కరిస్తున్నారన్నారు. సెర్ప్ ఉద్యోగులు పేదవారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పని చేయాలకోరారు. వైకేపీ ఏరియా కో ఆర్డినేటర్ గంగాధర్ మాట్లాడుతూ 23 శాతం ఫిట్‌మెంట్ ఈనెల జీతాలతో కలిపి ఇస్తున్నట్లు ప్రభుత్వం జీఓ 64 విడుదల చేసిందని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో 4 వేలకు పైగా సెర్ప్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు. థ్యాంక్యూ సీఎం అంటూ కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు పొందిన మల్లాపురం క్లస్టర్ సీసీ తిప్పేష్, కణేకల్లు ఏపీఎం గోవిందు, డి.హీరేహాళ్ సీసీ జి.గోపాల్, డి.హీరేహాళ్ మండలం గొడిశలపల్లి ఆనిమేటర్ జి.లక్ష్మీ, కణేకల్లు ఆనిమేటర్ బీ. శ్రావణి ప్రభుత్వ విప్ కాపు, ఎంపీ రంగయ్య ఘనంగ సన్మానించారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బోర్ వెల్ నాగిరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రాజు, పవన్, ఏపీఎంలు, సీసీలు, ఆనిమేటర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో ఉత్తమం

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య



విత్తన కిట్లు అందిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ రంగయ్య

రాయదుర్గం రూరల్: ప్రకృతి వ్యవసాయం ఎంతో ఉత్తమమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య రైతులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య అధ్యతన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న దళిత రైతులకు పీఎం అనుసూచిత జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా బుధవారం ఉచిత విత్తన కిట్లు, ఇతర పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో విద్యుత్ బిల్లులు తగ్గించమని అడిగిన పాపానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను తూటాలతో కాల్చి చంపించారని ఆరోపించారు. రైతు బాగుంటే దేశం బాగుంటుందని భావించిన సీఎం వైఎస్ జగన్ రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నారని తెలిపారు. ఆర్బీకేల ద్వారా నాణమైన విత్తనం, ఎరువులు అందించడంతోపాటు రైతుల నుంచి పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసి అండగా నిలుస్తున్నారన్నారు. రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ.13,500 అందిస్తున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 167 మంది దళిత రైతులకు రూ.10 వేల విలువ చేసే చిరు సంచి విత్తన కిట్లు , ఇతర పరికరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్నాయన్నారు. ఎంపీ తలారి రంగాయ్య మాట్లాడుతూ విష తుల్యమైన రసాయనాలతో కూడిన వ్యవసాయానికి స్వస్తి పలికి , సేంద్రియ ఎరువులతో పంటల సాగు చేసి పూర్వవైభవం తేవాలని రైతులను కోరారు. తద్వారా భవిష్యత్తరాలకు మంచి చేయాలన్నారు. వైఎస్ జగన్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా సహాయ , సహకారాలు అందిస్తుందన్నారు. డీపీఓ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా విత్తన కిట్లతో పాటు సీడ్స్ టు సీడ్స్ లో మొక్కజొన్న , వేరుశనగ ఇస్తున్నట్లు తెలిపారు. పెరటి తోటల్లో సాగుకు కూరగాయల విత్తనాలు అందిస్తున్నామన్నారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, ఎంపీపీ విద్యావతి, తాలూకా రైతు సంఘం అధ్యక్షుడు బోర్ వెల్ నాగిరెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున, కో ఆప్షన్ సభ్యుడు దిలావర్‌బాషా, ఎస్సీ కార్పొరేషన్ ఈఓలు ఎస్ఎస్ రాజు, శంకరయ్య, ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓలు మహేంద్ర, రేకులకుంట శివారెడ్డి, బీటీపీ గోవిందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి అమావాస్య పూజలు



అలంకరణలో యల్లమ్మ దేవత

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో బుధవారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, హోమం, ఆకుపూజ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఇదిలా ఉండగా నేమకల్లు అంజన్నకు బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అనీల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నగరేశ్వరునికి అమావాస్య పూజలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం అమావాస్య పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. మరోవైపు రామేశ్వర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. జరుట్లరాంపురంలోని జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమావాస్యలు జరిగాయి.

కుందుర్పి: శ్రావణమాస అమావాస్యను పురస్కరించుకుని బుధవారం వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.కుందుర్పి ఉల్లేగడ్డ తోటలో వెలసిన చౌడేశ్వరీ ఆలయం, నాగేపల్లి యల్లమ్మ ఆలయం, బెస్తరపల్లి సవారమ్మ ఆలయం, కుందుర్పి లక్ష్మీవేంకటేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

భూసమస్యలకు తక్షణమే పరిష్కారం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

కూడేరు: క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రికార్డు మేరకు భూసమస్యలకు తక్షణమే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ శేషారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పలు గ్రామాలకు చెందిన రైతులు భూసమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కలిసి అర్జీలు అందించారు. కొద్దిరోజులుగా అర్జీలిచ్చినా స్పందన లేదని రైతులు వాపోయారు. దీంతో ఆయన వెంటనే సంబంధిత వీఆర్వోలను పిలిచి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అసైన్డ్ భూసమస్యలను కమిటీలో పెట్టి న్యాయం చేస్తామని రైతులకు తహసీల్దార్ హామీ ఇచ్చారు.

సంక్షిప్త సమాచారం

జూదరుల అరెస్ట్

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద పేకాట ఆడుతున్న 9 మందిని బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు. వారి నుంచి రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లి గ్రామానికి చెందిన గంగప్ప (45) అనే వ్యక్తి గత ఐదు రోజులుగా కనబడటం లేదని కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే వెంటనే 8790124508 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఆస్పత్రి అభివృద్ధిపై సమావేశం

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో ఉన్న యూపీహెచ్‌సీలో బుధవారం ఆస్పత్రి అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. నూతన భవనాల ప్రారంభోత్సవం, గర్భిణుకలు అందుతున్న సేవలపై డాక్టర్ రాజేష్ వివరించారు. ఆస్పత్రిలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం డాక్టర్లకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశులు, చైర్మన్ సురేష్, డాక్టర్ రిహ జైనబ్, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఈసీ మెంబర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

వజ్రకరూరు: రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని వైకేపీ ఏపీఎం గుణశ్యాం సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఆనిమేటర్లతో సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ గ్రామ సంఘాలకు సంబంధించి రికార్డుల అప్‌డేషన్ పక్కాగా ఉండాలన్నారు. ఎప్పుడు ఆడిట్ జరిగినా చూపించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామాలవారీగా నిర్వహణపై సమీక్ష నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీసీలు రామాంజినేయులు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

గొందిపల్లిలో పాముకాటుతో మహిళకు అస్వస్థత

గుత్తి రూరల్: గొందిపల్లిలో ఓ మహిళ పాముకాటుతో తీవ్ర అస్వస్థతకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జయమ్మ బుధవారం గ్రామ శివారులోని తన వేరుశనగ పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. జయమ్మ బిగ్గరగా కేకలు వేయగా పక్క పొలంలో పనులు చేస్తున్న రైతులు వచ్చి పామును చంపారు. వెంటనే జయమ్మను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నిజవళ్లిలో భూసర్వే ప్రారంభం

కుందుర్పి: మండలంలోని నిజవళ్లి, బెస్తరపల్లి రెవెన్యూ గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ జగనన్న-శాశ్వత భూహక్కు భూరక్ష పథకం కింద భూసర్వేను రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ కుళ్లాయప్ప పర్యవేక్షణలో మండల, గ్రామ సచివాలయ సర్వేయర్లు భూములను సర్వే చేశారు. బ్రిటీష్ పాలనలో ఇలాంటి భూసర్వేలు జరిపినా నేటికీ భూ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. వీటికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూసర్వే చేపట్టిందన్నారు. శాశ్వత భూహక్కు కల్పించేందుకు రికార్డులు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు మమత, ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థి దేవికి నగదుతో పాటు బంగారు పతాకాన్ని అందిస్తున్న సిద్దేశ్వర్‌ప్రసాద్

ఉరవకొండ: అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడి పనిచేస్తున్న సిద్దేశ్వర్‌ప్రసాద్ ప్రతి యేడు తన పెద్దమ్మ భీమక్క పేరు మీద బీమా గ్రూప్ మెరిట్ అవార్డ్స్ పేరు విద్యార్థులకు అవార్డులను అందిస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం ఉరవకొండలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఉరవకొండకు చెందిన దేవి (975)కి రూ.5 వేల నగదుతో పాటు బంగారు పతాకాన్ని అందించారు. రెండు, మూడు, నాల్గవ స్థానాల్లో నిలిచిన లత, షాజియా, షమ్మలకు నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో దాత సిద్దేశ్వరప్రసాద్‌తో పాటు ఉరవకొండ ప్రిన్సిపాల్ మమత పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు

కళ్యాణదుర్గం రూరల్: మండలం పరిధిలోని మల్లాపురం గ్రామంలో బుధవారం పశువులకు చూడి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 250 పశువులకు మందులు వేశారు. గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. అనంతరం ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మంజునాథ్, సర్జన్ విజయ కుమారి, డాక్టర్ పుల్లారెడ్డి, అనిల్, గోపాల మిత్ర ఓంకార్ పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలి

అనంతపురం: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని జేఎన్‌టీయూ అనంతపురం ఎంబీఏ విభాధిపతి డాక్టర్ టి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ డి.వరలక్ష్మి ఆధ్వర్యంలో నా భూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నా భూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగం అడ్‌హాక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బీసీ లక్ష్మన్న, డాక్టర్ జయరామిరెడ్డి, డాక్టర్ బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుమ్మఘట్ట: కేపీదొడ్డి గ్రామంలో గురువారం ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ రమేష్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రేపు మాళాపురంలో..

విడపనకల్లు: మండల పరిధిలోని మాళాపురం గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

వర్షం కోసం ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

బ్రహ్మసముద్రం: పోలేపల్లి గ్రామంలోని సీఅండ్ఐజీఎం చర్చి ఆధ్వర్యంలో బుధవారం గ్రామ బహిరంగ సువార్త సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత చల్లా కిశోర్ చౌదరి, క్రీస్తు కిరణములు సువార్త బృందం సభ్యులు వర్షాలు కురవాలని ప్రార్థనలు చేపట్టారు. ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యేసు క్రీస్తు ప్రేమను వివరించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు సుమిత్రపాల్, జాన్ పాల్, మార్కయ్య, రవి, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఏకగ్రీవం



డిక్లరేషన్ అందుకుంటున్న సుంకమ్మ

ఉరవకొండ: మండల పరిధిలోని నెరిమెట్ల గ్రామ పంచాయతీ 7వ వార్డు సభ్యురాలిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు తలారి సుంకమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఈఓఆర్డీ చంద్రమౌళి, ఎంపీపీ చందా చంద్రమ్మ, నెరిమెట్ల గ్రామ సర్పంచ్ యోగేంద్రరెడ్డి చేతుల మీదుగా డిక్లరేషన్ ఫారాన్ని సుంకమ్మకు అందజేశారు. రెండు నామినేషన్లు దాఖలుకాగా రంగన్న అనే అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించామన్నారు. దీంతో సుంకమ్మకు ఏకగ్రీవం అయిందన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీఎన్జీఓ భవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయస్వామి, చిరంజీవి, మాజీ నాయకులు కొట్రేష్ ఆధ్వర్యంలో తాలూకా కమిటీ ఎన్నిక జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా అభిషేక్, ఉపాధ్యక్షులుగా సుదీప్, విష్ణు, మాంతేష్, ప్రధానకార్యదర్శిగా ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా శశి, ఈశ్వర్, వీరేష్, కోశాధికారిగా మల్లికార్జునతోపాటు 21 మంది కార్యవర్గ సభ్యులు, 43 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



ఫర్నీచర్ వితరణ చేసిన పూర్వ విద్యార్థులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని బెళుగుప్ప ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. బుధవారం బడి రుణం తీర్చుకుందాం అనే కార్యక్రమం ద్వారా 12 స్టీల్ కుర్చీలు, రెండు డ్రమ్స్‌ను వితరణగా అందించారు. ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ వారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు మండల పరిధిలోని గంగవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి శ్రీశైలప్ప బుధవారం రూ.10 వేలు వితరణ చేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందుబాటులో వైద్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుల్తానా

బొమ్మనహాళ్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ముంగిట్లో వైద్యం అందుతోందని, పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుల్తానా తెలిపారు. బుధవారం కల్లుహోళలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

జెడ్పీటీసీ సభ్యురాలికి పరామర్శ



పద్మావతిని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ కాపు, ఎంపీ రంగయ్య

కణేకల్లు: కణేకల్లు జెడ్పీటీసీ సభ్యురాలు డి.పద్మావతిని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య బుధవారం పరామర్శించారు. ఈనెల 12న జెడ్పీటీసీ సభ్యురాలు భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రైస్‌మిల్లు తిమ్మప్ప(70) అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈనేపథ్యంలో విప్ కాపు, ఎంపీ రంగయ్య ఇంటికెళ్లి పద్మావతి, కొడుకు మధును పరామర్శించారు. మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, గోప్పులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి, నాయకులు నాగరాజు, శ్రీనివాసులు ఉన్నారు.

నెట్టికంటుడి సన్నిధిలో ఎమ్మెల్సీ



స్వామి తీర్థప్రసాదాలను అందిస్తున్న ఆలయ సిబ్బంది

గుంతకల్లు రూరల్: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి దంపతులు బుధవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఉదయాన్నే ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ, ఆయన సతీమణి ఉమాదేవి దంపతులకు ఆలయ అధికారులు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారి కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు శివరామిరెడ్డి దంపతులకు స్వామివారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

నీట్ ర్యాంకర్లకు ఘన సత్కారం



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో ర్యాంకర్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మంటపంలో అవోపా, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నీట్- 2023 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఘన సత్కారం జరిగింది. పట్టణానికి చెందిన రేకులకుంట సత్యనారాయణ(ఎల్ఎస్ స్వీట్స్) కుమారుడు సాయి సూర్య గణేష్, చెక్క శ్రీనివాసులు కుమారుడు సాత్విక్, అనంతపురానికి చెందిన ఊరక్కర శ్రీధర్ కుమారుడు గౌతమ్‌లు నీట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం, యువజన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి

రాయదుర్గం రూరల్: మల్కాపురం గ్రామంలో కుక్కల దాడిలో 4 గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గొర్రెల యజమాని గలగల తమ్మణ్ణ మంగళవారం తన గొర్రెలను అడవిలోకి మేపుకోసం తీసుకెళ్లాడు. ఆ సమయంలో నాలుగు గొర్రెపిల్లలను దొడ్డిలో ఉంచి వెళ్లాడు. గ్రామంలోని రెండు వీధి కుక్కలు దొడ్డిలో ప్రవేశించి నాలుగు గొర్రె పిల్లలను చంపేశాయి. సుమారు రూ.25 వేలు నష్టం జరిగినట్లు తమ్మణ్ణ వాపోయాడు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ కార్యదర్శి మురళీ సూచించారు. బుధవారం మండలంలోని కొనకొండ్ల గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల ముందు మురికినీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి

బ్రహ్మసముద్రం: విద్యుత్ సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వేపులపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం రైతులు ధర్నా చేపట్టారు. గత వారం రోజులుగా విద్యుత్ కోతలతో పంట పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. అధికారులు సరైన సమయానికి విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి సకాలంలో విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో పొబ్బర్లపల్లి, వెస్ట్‌కోడిపల్లి, గుండిగానీపల్లి, వేపులపర్తి, గోవిందయ్యదొడ్డి తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గణిత అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కుందుర్పి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపక పోస్టు ఖాళీగా ఉందని ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18వ తేదీలోపు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 19న డెమోకు హాజరుకావాలని సూచించారు.

పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్‌గా వండ్రమ్మ



నూతనంగా ఎన్నికైన వండ్రమ్మకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్ఓ

విడపనకల్లు: మండల పరిధిలోని మాళాపురం కేజీబీవీ నూతన చైర్‌పర్సన్‌గా సీ.వండ్రమ్మను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఎస్ఓ తులసీప్రియ తెలిపారు. గతంలో చైర్మన్‌గా ఉన్న సింగాడీ వీరప్ప పదవీకాలం ముగియడంతో వండ్రమ్మను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది వండ్రమ్మకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మండల మీట్

రాయదుర్గం: డి హీరేహాళ్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌బాబు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నాణ్యతలో రాజీపడొద్దు



కూడేరు: కంకర రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డీఈ భరత్ ప్రకాష్‌రెడ్డి

కూడేరు: రోడ్డు పనుల నాణ్యతలో రాజీపడొద్దని క్వాలిటీ కంట్రోల్ డీఈ భరత్ ప్రకాష్ రెడ్డి మండల పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులుకు సూచించారు. కూడేరు మండల పరిధిలోని అరవకూరు గ్రామానికి అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి నుంచి తారు రోడ్డు నిర్మాణానికి రూ.75 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఇటీవల తారు రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకరతో రోడ్డు ఏర్పాటు చేశారు. బుధవారం క్వాలిటీ కంట్రోల్ డీఈ కంకర రోడ్డు నాణ్యతను పరిశీలించారు.